
తీరని దాహార్తి..!

- వేసవిలో పులిచింతల నిర్వాసితులకు తప్పని నీటి కష్టాలు
- మూతపడిన ఆర్వో ప్లాంట్‌ను తెరిపించాలని వినతి
- నిరుపయోగంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్
- అధికారులు వెంటనే స్పందించాలని వేడుకోలు


రాజుపాలెం నిర్వాసితుల కేంద్రం ఏరియల్ వ్యూ


నిరుపయోగంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్

రాజుపాలెం: వేసవి కాలం వచ్చిందంటే నీటి కష్టాలు తప్పడం లేదు. తాగు నీటిని డబ్బులు ఖర్చుపెట్టి కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. గత ఏడేళ్ల క్రితం పులిచింతల నిర్వాసిత కేంద్రంలో గల కమ్యూనిటీ హాల్‌లో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఏడాది నుంచి ఆర్వో ప్లాంట్ పనిచేయకపోవడంతో మంచినీటి కోసం నానా అవస్థలు పడుతున్నామని నిర్వాసితులు వాపోతున్నారు. పులిచింతల నిర్వాసిత కేంద్రంలో లక్షలు ఖర్చుపెట్టి కట్టిన ఓవర్‌హెడ్ ట్యాంక్ అలంకారప్రాయంగా ఉంది. నిర్వాసితుల దాహార్తి తీర్చేందుకు ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించిన తాగు నీటి కష్టాలు తప్పడం లేదు. సుమారు 16 ఏళ్ల క్రితం నిర్వాసితులకు నీళ్ల ట్యాంకులతో పాటు బోరింగ్‌లు వేసి వాటికి విద్యుత్ మోటార్లను బిగించారు. అయినా అవి సక్రమంగా పనిచేయకపోవడంతో నీళ్లకు అవస్థలు పడుతూనే ఉన్నారు. అప్పటి అధికారులు ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు నీటిని ఎక్కించి ప్రతి బజారుకు సరఫరా అయ్యే విధంగా ట్యాప్‌లు బిగించినా పని చేయడం లేదు. ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు నీటిని ఎక్కించలేకపోయారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అది నిరుపయోగంగా ఉంది.

నీటిని సరఫరా చేయాలి

మండల కేంద్రంలోని రాజుపాలెం పంచాయతీ పరిధిలో పులిచింతల నిర్వాసిత కేంద్రం ఏర్పాటు చేశారు. ముంపు గ్రామాలైన కోళ్లూరు, గొల్లపేట, గోపాలపురం, చిట్యాలతండా, చిట్యాల, కేతవరం తదితర గ్రామాలకు చెందిన వారు ఇక్కడికి తరలివచ్చారు. కేంద్రంలో 385 ప్లాట్లను కేటాయించగా ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. సుమారు 1,600 మంది జనాభా నివసిస్తున్నారు. 780 మంది ఓటర్లు ఉన్నారు. నిర్వాసితుల కేంద్రంలో ఆరు బోర్లు వేసి విద్యుత్ మోటార్లను బిగించి నీటిని సరఫరా చేస్తున్నారు. విద్యుత్ మోటార్లు సక్రమంగా పనిచేయక పోవడంతో నీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. ప్లాట్లు అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండడంతో బోరు వేసుకుందామన్నా నీళ్ల పడక ఇబ్బందులు పడుతున్నారు. 200 నుంచి 300 అడుగుల వరకు బోరు వేసినా నీరు వస్తుందని నమ్మకం లేని పరిస్థితి. రాజుపాలెంకు నాగిరెడ్డిపాలెం చెరువు ద్వారా ప్రతి రోజు మంచినీటి కుళాయిల ద్వారా అందిస్తున్నారు. అదే విధంగా నిర్వాసిత కేంద్రంలోని ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు కూడా నీటిని ఎక్కించి ప్రతి రోజు సరఫరా చేయాలని అధికారులను కోరుతున్నారు.

మూతపడిన ఆర్వో ప్లాంట్

నిర్వాసిత కేంద్రంలో గల కమ్యూనిటీ హాల్‌లో ఏడేళ్ల క్రితం ఆర్వో ప్లాంట్‌ను ప్రభుత్వ అనుమతితో దాతలు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఆర్వో ప్లాంట్‌ను నిర్వహిస్తూ క్యాను రూ.5 కే అందించేవారు. అది కాస్త మూత పడడంతో ఇప్పుడు క్యాన్ రూ.20కు కొనుక్కోవాల్సి వస్తుందని నిర్వాసితులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూతపడిన ఆర్వో ప్లాంట్‌ను నిర్వహణలోకి తేవాలని కోరుతున్నారు.


మూతపడిన ఆర్వో ప్లాంట్

క్యాన్ రూ.20కు కొంటున్నా



తాగడానికి క్యాన్ వాటర్ రూ.20కు కొంటున్నాను. ఒక్కొక్క ఇంటికి రోజుకు రెండు నుంచి మూడు క్యాన్‌ల వాటర్ పడుతుంది. రెక్కాడితే గాని డొక్కాడని మేము రోజు వారీ నీళ్ల కొనుక్కుని తాగాలంటే అల్లాడిపోతున్నాం. మూత పడిన ఆర్వో ప్లాంట్‌ను తెరిపించాలి. అధికారులు స్పందించి ఉచితంగా మంచినీరు సరఫరా చేయాలి.

– ముళ్ల సుధాకర్, నిర్వాసితుడు

ట్యాంక్‌కు నీరు ఎక్కించాలి



మాకు అటవీ ప్రాంతానికి సమీపంలో నిర్వాసిత కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీని వలన కాస్త స్తోమత ఉన్న వారు 300 అడుగుల బోరు వేసుకుంటేనే కొంచెం నీరు వస్తుంది. స్తోమత లేని వారు నీటి కష్టాలు పడుతున్నారు. ఈ కేంద్రంలో 80 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన వారే ఉన్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఓవర్ హెడ్ ట్యాంక్‌కు నీరు ఎక్కించి సరఫరా చేయాలి.

– మెరుగు లక్ష్మన్‌రావు, నిర్వాసితుడు

మీలో ఒకడిగా అండగా ఉంటా

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి



ముప్పాళ్ల: నన్ను నాయకుడిగా కాకుండా మీలో ఒకడిగా, వైఎస్సార్‌సీపీ కార్యకర్తగా చూడాలని అన్ని విధాలా మీకు అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలోని సాయిబాబా ఆలయ ఆవరణలో వైఎస్సార్‌సీపీ మండల స్థాయి ఆత్మీయ సమావేశం బుధవారం జరిగింది. సమావేశంలో డాక్టర్ గజ్జల మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు పెరుగుతూనే ఉన్నాయని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని చెప్పారు. అన్ని వేళలా అందుబాటులో ఉంటానని, మీకు తోడుగా నడుస్తానని అన్నారు. రాబోయే రోజుల్లో సత్తెనపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరేలా పని చేద్దామని, మీ అందరి సహకారం అందించాలని కోరారు. ప్రతి గ్రామాన్ని సందర్శించి, ప్రతి కార్యకర్త, నాయకులందరిని కలుస్తానన్నారు. సమష్టి కృషితో మరలా జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. అన్ని గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తానని చెప్పారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ అధ్యక్షురాలు ఆర్.మాధవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, పార్టీ నాయకులు ఎంజీఎం రామలింగారెడ్డి, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, ఇందూరి నరసింహారెడ్డి, మణిరావు, వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



సత్తెనపల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ నిర్వహించడం జరుగుతుందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణ రఘురాం నగర్‌లోని తన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి వాటిని పరిశీలించారు. ప్రతి సమస్యను పరిష్కరిస్తామని, సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే సమస్యల పరిష్కారం దిశగా పనిచేయాలని అధికారులకు సూచించారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు

ఎంపీడీవో సత్యనారాయణ

రాజుపాలెం: మండలంలో నేటి నుంచి 11వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జీవీ సత్యనారాయణ బుధవారం తెలిపారు. 3వ తేదీన అనుపాలెం, చౌటపాపాయపాలెం, కుబాద్‌పురం, 4వ తేదీన కోటనెమలిపురి, రాజుపాలెం, అనుపాలెం, 8వ తేదీన రెడ్డిగూడెం, బ్రాహ్మణపల్లి, ఇనిమెట్ల, 9వ తేదీన మొక్కపాడు, దేవరంపాడు, ఉప్పలపాడు, 10వ తేదీన గణపవరం, అంచులవారిపాలెం, చాల్లాపల్లితండా, 11వ తేదీన బీరవల్లిపాయ, నెమలిపురి, బలిజేపల్లి తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చేర్పులుమార్పులు ఉన్నా, కొత్తగా ఆధార్ కార్డులు పొందేవారు ఆయా గ్రామాల్లోని ఆధార్ క్యాంప్‌ల్లో పాల్గొనాలని సూచించారు.

వైభవంగా మహాగణపతి విగ్రహ ప్రతిష్ట



ముప్పాళ్ల: మండల కేంద్రమైన ముప్పాళ్లలోని సీతారామ స్వామి దేవస్థానం పక్కన మహాగణపతి నూతన విగ్రహ ప్రతిష్టా మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి సుప్రభాతసేవ, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం ఉదయం 9.30 గంటలకు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి వారిని ప్రతిష్ఠించారు. యేరువ సాంబశివరెడ్డి, ధనుంజయరెడ్డి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తహసీల్దార్ ఎం.భవానిశంకర్, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం



సత్తెనపల్లి: మండుతున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రజల దాహార్తి తీర్చుటకు సామాజిక బాధ్యతగా ఉచిత మంచినీరు అందించాలనే ఉద్దేశంతో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ అన్నారు. ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ సత్తెనపల్లి ఆధ్వర్యంలో పట్టణంలోని పెన్షనర్స్ హోమ్ ఎదుట చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ చలివేంద్రం మే 31 వరకు సుమారు రెండు నెలల పాటు కొనసాగించాలని ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ నిర్ణయించుకుందన్నారు. కార్యక్రమంలో ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేబీఆర్‌జె ప్రసాద్, ఉపాధ్యక్షుడు పి.చంద్రయ్య, బాధ్యులు కె.పోతులూరయ్య, అంకాళ్ళ ప్రభుదాసు, డాక్టర్ సరికొండ రమాదేవి, జి.సుందర్ సింగ్, సుబ్బారావు, ఖాదర్‌వలి పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

ఆయుర్వేద వైద్యాధికారి డా. శ్రీనివాస్



బెల్లంకొండ: వేసవిలో వడదెబ్బకు గురికాకుండా విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని మండల ఆయుర్వేద వైద్యాధికారి డా.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ మెయిన్ పాఠశాలలో వడదెబ్బ నివారణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేసవిలో విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆహార నియమాలపై వివరించారు. అధిక మొత్తంలో నీటిని తాగాలని, సెలవుల్లో ఎండలో తిరగకుండా, నీడలో ఆడుకోవాలని సూచించారు. అనంతరం తరుణ వ్యాధులకు, వ్యాధి నిరోధక శక్తి పెంచడానికి ఆయుష్ మందులను పంపిణీ చేశారు. విద్యార్థులతో యోగాసనాలను చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉదయ్‌కుమార్, ఆయుష్ సిబ్బంది వెంకట్రామయ్య, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే ప్రజా దర్బార్

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్


ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు : ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే ప్రజా దర్బార్ కార్యక్రమమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. పెదకూరపాడు పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్‌లో ఎమ్మెల్యే ప్రవీణ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ శాఖలకు సంబంధించి 51 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో సోమయాజులు తెలిపారు. పంచాయతీరాజ్, రెవెన్యూ, పోలీస్, విద్యుత్ తదితర సమస్యలపై వచ్చిన దరఖాస్తులను స్వీకరించి సమస్యలను పరిష్కరించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు లేకుండా ఉండేందుకే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామన్నారు.

వేసవిలో చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయి

రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని, ఇంటి నుంచి బయటకు వచ్చే సమయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో జనచైతన్య సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రం వద్ద బుధవారం గుడిపూడి కాంతారావు రెండవ వర్ధంతిని పురస్కరించుకొని వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన ఉచిత నిమ్మరసాన్ని ఎమ్మెల్యే ప్రవీణ్ ప్రారంభించి మాట్లాడుతూ ఎవరి పరిధిలో వారు తమకున్నంతలో ఇతరులకు సహాయం చేస్తే తృప్తిగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఆర్తిమల్ల రమేష్, సర్పంచ్ గుడిపూడి రాజు, మండల టీడీపీ నాయకులు మక్కెన సాగర్, ఆర్తిమల్ల శ్రీనివాసరావు, వాసిరెడ్డి అనిల్ కుమార్, నరేష్, జన చైతన్య సమితి కార్యదర్శి తుల్లూరి సాంబశివరావు, కో ఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్, కొరప్రాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాలికలు జాగూరకతతో వ్యవహరించాలి



మాట్లాడుతున్న సీఐ సుభాషిణి

నకరికల్లు: కొత్తవారు, పరిచయం లేనివారితో బాలికలు అప్రమత్తంగా వ్యవహరించాలని మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుభాషిణి సూచించారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులకు శక్తి యాప్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శక్తి యాప్ బాలికలకు రక్షణ ఇస్తుందన్నారు. యాప్‌ను ఉపయోగించే విధానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. కొత్తవారు వచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నా, బండి ఎక్కమని మాయమాటలు చెబుతున్నా జాగూరకతతో వ్యవహరించాలని అన్నారు. సోషల్ మీడియా మాయలో పడవద్దని సూచించారు. అనుమానితుల నుంచి ప్రమాదం పొంచి ఉందన్న ఆలోచన వస్తే పరిచయస్తులు, పోలీస్ వారి నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చి ప్రమాదం నుంచి తెలివిగా తప్పించుకోవాలన్నారు. అనంతరం శక్తి యాప్ పోస్టర్‌లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్ఐలు సంధ్యారాణి, చల్లా సురేష్, ప్రిన్సిపాల్ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

చామర్రు గ్రామ భూముల ఆన్‌లైన్ ప్రారంభం

అచ్చంపేట: మండలంలోని చామర్రు రెవెన్యూ పరిధిలోని గ్రామాల సేద్యపు భూములను ఆన్‌లైన్ చేసి యూనిక్ నంబరు ఇచ్చే ప్రక్రియను బుధవారం నుంచి ప్రారంభించినట్లు ఏవో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఈ ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని, కానీ చామర్రు రెవెన్యూ పరిధిలోని గ్రామాల భూముల నమోదు కార్యక్రమం సాంకేతిక సమస్యల కారణంగా కాలేదన్నారు. ఉన్నతాధికారుల చొరవతో సాంకేతిక సమస్యలను పరిష్కరించి ఆన్‌లైన్ ప్రక్రియను ప్రారంభించడం జరిగిందన్నారు. చామర్రు రెవెన్యూ పరిధిలోని గ్రామాల రైతులు యూనిక్ నంబరు నమోదు చేయించుకునేందుకు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ తీసుకుని రావలసి ఉంటుందని చెప్పారు. మరో వారం రోజులపాటు మాత్రమే ఈ అవకాశం ఉంటుందని, రైతులు త్వరపడి సహకార పరపతి సంఘం వద్ద గల రైతు సేవా కేంద్రంలో తమ భూములను ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు. యూనిక్ నంబర్లు ఉంటేనే ప్రభుత్వ రాయితీలు, పంట కొనుగోళ్లు, ప్రభుత్వ పరిహారం వంటివి పొందే అవకాశం ఉంటుందని ఏవో తెలిపారు.

గ్రామగ్రామాన పశువుల నీటి తొట్ల నిర్మాణం


వేల్పూరు పశువులతొట్టి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఉపాధి సిబ్బంది

అచ్చంపేట: పశువులకు వేసవి నీటి ఎద్దడి నివారణకు ఏపీ పంచాయతీరాజ్ కమిషనర్, పల్నాడు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు అచ్చంపేట మండలంలోని గ్రామాల్లో పశువుల తొట్ల నిర్మాణం చేపట్టినట్లు ఉపాధి హామీ పథకం ఏపీఎం సీహెచ్ వెంకటేశ్వర్లు చెప్పారు. ఇందులో భాగంగా బుధవారం మండలంలోని చిగురుపాడు, మిట్టపాలెం, వేల్పూరు, రుద్రవరం, పెదపాలెం గ్రామాలలో నీటి తొట్ల నిర్మాణం చేపట్టామన్నారు. పశువులు ఎక్కువగా సంచరించే ప్రాంతాలలో వీటి నిర్మాణాలను చేపడుతున్నట్లు చెప్పారు. వీటిని మెటీరియల్ కాంపోనెంట్స్ ద్వారా నిర్మించడం జరుగుతుందని, ఒక్కొక్క తొట్టికి రూ.40 వేల వరకు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి స్వాతీదేవి, సర్పంచ్‌లు, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులకు 550 మంది కూలీలు హాజరు

మండలంలోని వివిధ గ్రామాలలో చేపట్టిన ఉపాధి హామీ పనులకు బుధవారం 550 మంది కూలీలు హాజరైనట్లు ఏపీఎం సీహెచ్ వెంకటేశ్వర్లు చెప్పారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గ్రామాలలో జరుగుతున్న పనులను ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు పరిశీలించారు. పనులపై ప్రతి గ్రామంలో దండోరా ద్వారా ఉపాధి కూలీలకు తెలియజేయాలని ఫీల్డ్ అసిస్టెంట్స్‌కు సూచించారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీకి తప్పనిసరిగా పని ఉంటుందని అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి పనులు కేవలం కూలీలతోనే చేయించాలని ఎంపీడీవో స్పష్టం చేశారు.

రుణ మేళాకు 173 మంది హాజరు



ముప్పాళ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద చాగంటివారిపాలెం రైతు సేవా కేంద్రంలో జరిగిన రుణ మేళాకు 173 మంది హాజరైనట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో జీ కాశయ్య బుధవారం తెలిపారు. బీసీ, ఈబీసీ కార్పొరేషన్‌లకు 42 యూనిట్లు మంజూరు కాగా, 173 దరఖాస్తులు అందాయన్నారు. ఇంటర్వ్యూలకు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్(మాదల), చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్(ముప్పాళ్ళ), యూనియన్ బ్యాంక్(సత్తెనపల్లి)కి చెందిన సిబ్బంది హాజరైనట్లు ఆయన తెలిపారు. ఈడీపీఆర్డీ రూపవతి, కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావులు పర్యవేక్షించారు.

మాదిపాడులో పట్టపగలు చోరీ

అచ్చంపేట: పట్టపగలు దుండగులు ఎవరూలేని ఇంట్లోకి ప్రవేశించి రూ.5 లక్షల విలువచేసే బంగారు ఆభరణాలు రూ.1.50 లక్షల నగదు దొంగిలించిన ఘటన మండలంలోని మాదిపాడులో మంగళవారం చోటు చేసుకుంది. బాధితులు అచ్చంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన మోటార్ మెకానిక్ షేక్ అక్బర్‌వలి మంగళవారం ఉదయం సామాను కొనుగోలు చేసేందుకు ఇంటికి తాళం వేసి కృష్ణానది దాటి వెళ్లాడు. సాయంత్రం 7 గంటల సమయంలో వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూస్తే బీరువాలో దాచుకున్న బంగారు ఆభరణాలు రూ.1.50 లక్షల నగదు కనిపించలేదు. ఇరుగు పొరుగు వారిని అడిగినా ఫలితం లేకపోయింది. దీంతో మంగళవారం రాత్రి అచ్చంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నేడు నష్ట పరిహారంపై రైతులతో సమావేశం

నకరికల్లు: పైపులైన్ ఏర్పాటు చేసే క్రమంలో భూములను కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం విషయమై గురువారం సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె.పుల్లారావు బుధవారం తెలిపారు. మండలంలోని చల్లగుండ్ల, నకరికల్లు, నర్సింగపాడు గ్రామాల్లో బీపీసీఎల్ పైపులైన్ ఏర్పాటు చేస్తున్న భూముల రైతులకు నష్టపరిహారం విషయమై సంబంధిత రైతులతో జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ, బీపీసీఎల్ సంస్థ ప్రతినిధులు మాట్లాడి రైతుల అభిప్రాయాలను సేకరిస్తారని అన్నారు. ఆయా గ్రామాలలో భూములు కోల్పోతున్న రైతులు గురువారం మధ్యాహ్నం 3 గంటలకు హాజరు కావాలని సూచించారు.

సత్తెనపల్లి కోర్టుకు హాజరైన మాజీ మేయర్ కావటి


సత్తెనపల్లి కోర్టు నుంచి బయటకు వస్తున్న గుంటూరు నగర మాజీ మేయర్ కావటి

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు గుంటూరు నగర మాజీ మేయర్ కావటి మనోహర్ నాయుడు బుధవారం హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో గతంలో జరిగిన దాడికి నిరసనగా క్రోసూరులో చేసిన ధర్నాపై అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆయనపై కేసు నమోదు చేసింది. ఆ కేసులో కోర్టుకు ఆయన హాజరు కాగా విచారణ నిమిత్తం కేసును వాయిదా వేసినట్లు పెదకూరపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్, సీనియర్ న్యాయవాది మర్రి వెంకట సుబ్బారెడ్డి తెలిపారు.

తెరుచుకున్న డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం

వెంటనే తెరిచి విధులు నిర్వహించాలని ఆదేశించిన డీఎంహెచ్‌వో

సాక్షి ఎఫెక్ట్


వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో విధులకు హాజరైన ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు

దొడ్లేరు(క్రోసూరు): ‘తెరుచుకోని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం’ అని సాక్షిలో బుధవారం వచ్చిన కథనానికి పల్నాడు డీఎంహెచ్‌వో బి.రవి స్పందించి తక్షణమే భవనం తెరవాలని మండల వైద్యాధికారులను ఆదేశించారు. వెంటనే క్లినిక్‌ను తెరుస్తున్నట్లు రాతపూర్వకంగా మండల వైద్యులు డాక్టర్ సాద్, డాక్టర్ సిరిచందన డీఎంహెచ్‌వోకు తెలియజేశారు. ఎంఎల్‌హెచ్‌పీ ధనరేఖ, ఏఎన్ఎం కోటేశ్వరమ్మ, ఆశ వర్కర్లు హాజరై విధులు నిర్వహించారు. ఇక నుంచి దొడ్లేరు–2 సచివాలయ పరిధి ప్రజలకు హెల్త్ క్లినిక్ భవనంలో ఎంఎల్‌హెచ్‌పీ అందుబాటులో ఉండి బీపీ, షుగర్, రక్త పరీక్షలు వంటివి నిర్వహించి వైద్యుల సూచనల మేరకు మందులు రాయటం, ఇవ్వటం జరుగుతుందని వైద్యులు తెలిపారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు సేవా దృక్పథంతో ఉండాలి


స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు

రాజుపాలెం: స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో పాల్గొనే విద్యార్థులు సేవా దృక్పథం కలిగి ఉండాలని గైడ్స్ కోర్సు కో ఆర్డినేటర్ డాక్టర్ ఉన్నం పద్మావతి తెలిపారు. మండలంలోని గణపవరం జిల్లా పరిషత్ పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న గైడ్స్ కోర్సు కో ఆర్డినేటర్ మాట్లాడుతూ గైడ్స్ క్రమశిక్షణతో మెలగాలని, సేవా కార్యక్రమాలలో పాల్గొనాలని తెలిపారు. ప్రతి గైడ్ మానవతా దృక్పథంతో మెలగాలని, పాఠశాలలు పరిశుభ్రంగా ఉంచే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం 16 మంది బాలురకు, 16 మంది బాలికలకు గైడ్స్ కిట్స్‌ను అందజేసిందని, అదేవిధంగా పాఠశాల ఓల్డు స్టూడెంట్స్ అసోసియేషన్ గైడ్స్ కిట్సుకు రూ.32 వేలను హెచ్‌ఎం బి.సుగుణమణికి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూలక్ష్మి, ఈశ్వరవరప్రసాద్, స్కౌట్స్ మాస్టర్ సీతారామయ్య, గైడ్స్ టీచర్ రమణమ్మ పాల్గొన్నారు.

పశు బీమాకు ప్రీమియం తగ్గింపు

పశు వైద్యాధికారి డాక్టర్ స్వాతీదేవి

అచ్చంపేట: పశు పోషకులు తమ పశువులకు పశు బీమా పథకం ద్వారా చెల్లించవలసిన బీమా ప్రీమియం తగ్గించినట్లు పశు వైద్యాధికారి డాక్టర్ స్వాతీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.30 వేల విలువచేసే పశువుకు చెల్లించాల్సిన బీమా ప్రీమియం రూ.398 ఉండేదని, ఇప్పుడు రూ.298 చేసినట్లు చెప్పారు. ప్రతి రైతు 10 పశువుల వరకు ఈ బీమా పథకం ద్వారా లబ్ధి పొందవచ్చన్నారు. బీమా కాలపరిమితి మూడు సంవత్సరాలు ఉంటుందన్నారు. అనుకోని విపత్తు జరిగి పశువు మృతి చెందినా, జబ్బు పడినా బీమా మొత్తం రైతు బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఏరియా వైద్యశాల ప్రాంగణంలో అన్నసంతర్పణ

సత్తెనపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల ప్రాంగణంలో డొక్కా సీతమ్మ అన్న ప్రసాద వితరణ పథకంలో భాగంగా జనసేన పార్టీ నాయకుడు అప్పాపురపు నరేంద్ర ఆధ్వర్యంలో పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు అన్నం సత్యనారాయణ ధర్మపత్ని కీర్తిశేషులు అన్నం దేవకీదేవి పుణ్యతిథి సందర్భంగా బుధవారం 180 మంది రోగులు, సహాయకులకు అన్నసంతర్పణ నిర్వహించారు. దేవకీదేవి కుమారుడు న్యాయవాది అన్నం కృష్ణ, వారి కుటుంబ సభ్యులు స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు ఉన్నారు.

డీఎస్పీ కార్యాలయం సందర్శించిన ఎస్పీ

సత్తెనపల్లి: సత్తెనపల్లిలోని డీఎస్పీ కార్యాలయాన్ని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు బుధవారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల నకరికల్లు మండలంలో జరిగిన హత్య ఘటనపై చర్చించారు. అనంతరం పట్టణంలో విజువల్ పోలీసింగ్ నిర్వహించాలని సూచించారు. ఆయనతోపాటు సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతురావు ఉన్నారు. అనంతరం డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐలు, ఎస్సైలు విజువల్ పోలీసింగ్‌లో భాగంగా పట్టణంలో పర్యటించారు.